షరా మామూలే!

- విస్తరించినా ప్రయోజనం శూన్యం
- ఆక్రమణలతో ఇరుకుమయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



విస్తరించకముందు ఇరుగ్గా రోడ్డు



లక్షల వ్యయంతో నిర్మించిన మార్గంపై ఆక్రమణలు

మల్కాపురం:

ప్రజల అవసరాల కోసం లక్షల వ్యయంతో ఇరుగ్గా ఉన్న మార్గాన్ని విస్తరించారు. కొందరి స్వార్థంతో నేడు ఆ విశాలమైన మార్గం మరలా ఇరుకుమయంఅవుతోంది.ఫలితంగా వాహనాల రాకపోకలకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ఆక్రమణల జోలికి వెళ్లకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం కష్టా బార్ అండ్ రెస్టారెంట్ వెనుక 30 అడుగుల వెడల్పుతో కూడిన మార్గం ఉండేది. ఈ మార్గంలో ప్రకాష్‌నగర్,జనతాకాలనీ,టీడీపీకాలనీ,అచ్చినాయుడు లోవ వంటి ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వారితో పాటు మల్కాపురం,గాంధీ జీవీధి తదితర ప్రాంతాల వాసులు కూడా ఈ మార్గం ద్వారానే ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. 2014కు ముందే వాహనాల వినియోగం తక్కువగా ఉన్నా.జన సంచారం అంతగా లేకున్న రోజుల్లోనే నిత్యం ఇబ్బందులు తలెత్తేవి. మార్గానికి ఇరువైపులా ఆటోలు,ట్రాక్టర్లు వంటివి పార్కింగ్ చేయడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే వారు. దీంతో అప్పుడు పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ చొరవతో రోడ్డును 40 అడుగులుగా విస్తరించారు. దీనికి నాడు సుమారు రూ. 20 లక్షల వరకు జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు.దీంతో వాహనదారులతో పాటు పాదచారులుహాయిగా రాకపోకలు సాగించేవారు. తమ కష్టాలు తీరాయని సంతోషించారు. అయితే ఈ ముచ్చట ఎంతో కాలం లేదు. మరలా కొందరు తమ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కు చేయడం,రోడ్డుపై ఇసుక,పిక్క వంటివి డంప్ చేయడంతో రోడ్డు ఇరుగ్గా మారింది. మరికొంత మంది కాలువను దాటి నిర్మాణాలు చేయడంతో మరలా ఈ మార్గం ఇరుగ్గా మారింది. ఎప్పటిలాగే తిప్పలు తప్పలేదం లేదని ఈ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విశాలమైన మార్గంలో వాహనాలు పార్కు చేయకుండా.. రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులు



నాడు కష్టా బార్ రోడ్డు ఎలా ఉండేదో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకుంటుంది.లక్షల వ్యయంతో ఈ మార్గాన్ని విస్తరించినా ఫలితం లేదు.సాయంత్రం నుంచి ఈ మార్గంలో విపరీతమైన జన సంచారం ఉంటుంది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు తప్పించే క్రమంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది.

– నర్సింగరావు, వాహనదారు

కొందరి స్వార్థం వల్లే సమస్య



కొంత మంది స్వార్థం కారణంగా ఈ మార్గం ఇరుగ్గా మారుతోంది.రోడ్డుకు ఇరుపైపులా వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. మరికొంత మంది భవన నిర్మాణ సామగ్రి డంప్ చేసి రోజుల తరబడి వదిలేస్తున్నారు. అసలే జన సంచారం పెరిగింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఖాన్, స్థానిక వాసి

మందుబాబులకు జరిమానా

గోపాలపట్నం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసుల్లో ఐదుగురికి 2వ తరగతి స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె. మురళీకృష్ణ రూ.50వేలు జరిమానా విధించారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మార్చి నెలలో నమోదైన కేసుల్లో జరిమానాతో పాటు నాలుగు రోజులు జైలు శిక్ష విధించారు.

ఏఎంసీ బ్యాడ్మింటన్ జట్టుకు కాంస్య పతకం



కెప్టెన్ భానును, టీమ్ సభ్యులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

మహారాణిపేట: అంతర వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మార్చి 15 నుంచి 17 వరకు గన్నవరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో ఏఎంసీ విద్యార్థులు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ భాను, సభ్యులు డి.చరణ్ నారాయణ్, బి.అంబేడ్కర్, డి.ధనుష్, తరుణ్ శ్రీరామ్ తదితరులను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎస్.ఎం.సంధ్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ (జనరల్) డాక్టర్ ఎ.కృష్ణవేణి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు, స్పోర్ట్స్ కార్యదర్శి భాను సతీష్ విజేతలను అభినందించారు.

క్లుప్తంగా

సాయిబాబా విగ్రహం ఏర్పాటు



అన్నం వండుతున్నట్టు ఉన్న సాయిబాబా విగ్రహం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం అన్నదానం నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా అన్నదానం జరిపే చోట సాయిబాబా అన్నం తన చేతితో కలుపుతున్నట్టు ఉండే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహం ఏర్పాటు వల్ల ఆ బాబా స్వయంగా తన భక్తులకు ప్రసాదం వండి వార్చుతున్నట్టు ఉంటుందనిభక్తుల నమ్మకం.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి



ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య: నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆల్ఫా కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ బోర్డ్ ఆఫ్ సెక్రటరీ బీవైపి శ్రీనివాసరెడ్డి బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సామాజిక న్యాయం అందరికీ అందించాలనే లక్ష్యంతో జాతీయ స్థాయిలో పనిచేస్తున్న సంస్థకు ఆల్ఫా కృష్ణ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడంతో పలువురు అభినందనలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ, హక్కుల సాధన కోసం ఆల్ఫా కృష్ణ ఇప్పటికే వివిధ సంస్థల్లో పనిచేస్తున్నారు. ప్రజల పక్షాన నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం సంస్థ ద్వారా తన వంతు కృషి చేస్తానని కృష్ణ తెలిపారు. సంస్థ ఆశయాల సాధనలో భాగంగా ఎన్‌ఎఫ్‌హెచ్ఆర్‌సీ విస్తరించేలా తగిన కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు.

పేదలకు నిత్యావసరాల వితరణ



పేదలకు సరకులు అందజేస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దొడ్డి కిరణ్ పేదలకు నిత్యావసరాలు వితరణ చేశారు. బుధవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా అభిమానుల మధ్య కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా డీకే ఫౌండేషన్ ద్వారా పేదలకు సాయం అందించామని తెలిపారు. కాగా కిరణ్‌ను 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, పార్టీ నాయకులు దాడి నూకరాజు,రవి, కిరణ్, సత్తిబాబు, ధనరాజ్ తదితరులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కోఆపరేటివ్ స్టోర్స్ మహాజన సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్ 59వ మహాజన సభ గురువారం నిర్వహించనున్నారు. సెక్టార్–1 స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు సభ ప్రారంభం కానుంది. సభ్యులు హాజరై సభను జయప్రదం చేయాలని స్టోర్స్ కార్యదర్శి ఆకుల నూకరాజు కోరారు.

ఇంటర్ స్టీల్ కబడ్డీ రన్నరప్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న విశాఖ స్టీల్ ప్లాంట్ జట్టు క్రీడాకారులు

ఉక్కునగరం: జాతీయ ఇంటర్ స్టీల్ కబడ్డీ పోటీల రన్నరప్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు నిలిచింది. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో రూర్కెలాలో ఈనెల 17 నుంచి 19 వరకు జాతీయ స్థాయి ఇంటర్ స్టీల్ కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తొమ్మిది స్టీల్‌ప్లాంట్లకు చెందిన జట్లు పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భిలాయ్ జట్టు 39–34 స్కోరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై గెలుపొందింది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులు మొల్లి అప్పలరాజు (కెప్టెన్), ఉరుకూటి అప్పారావు, శివకుమార్, ఎం.సురేష్, ఐ.అప్పలరాజు, రాజాబాబు, తేజు, దుర్గాప్రసాద్, ప్రసాద్, హరీష్, హేమత్, మహేష్‌లను జట్టు మేనేజర్ సత్యం, కోచ్ దేముడు అభినందించారు.

కళ్లుతిరిగి పడి పోర్టు ఆస్పత్రి ఉద్యోగి మృతి



గోవిందరావు(ఫైల్)

గోపాలపట్నం: గోపాలపట్నం శ్రీరామ్‌నగర్ నుంచి నార్త్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో అండర్‌పాస్‌వే సమీపంలో కళ్లుతిరిగి ఒక్కసారిగా పడిపోవడంతో తలకు గాయమై పోర్టు ఉద్యోగి ఎన్నేటి గోవిందరావు(58) అక్కడికక్కడే మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. నార్త్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారిలో గోవిందరావు కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. బుధవారం సాయంత్రం టీ తాగేందుకు గోపాలపట్నం వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో కొత్తపాలెం అండర్ పాస్‌వే సమీపంలో కళ్లు తిరగడంతో తూలి పడ్డాడు. దీంతో రోడ్డుకు తల తగలడంతో తీవ్ర గాయమయింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గోవిందరావు పోర్టు ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. కాగా అనారోగ్యం కారణంగా కొద్దికాలంగా సెలవులో ఉన్నాడు. ఇంతలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.


స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ ఆపరేషన్స్ డైరెక్టర్ సలీంతో సమస్యలపై చర్చిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. యూనియన్ నాయకులు బుధవారం డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి పురుషోత్తమన్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. కార్మికులు కష్టించి పనిచేసి నూరు శాతం ఉత్పత్తి సాధించడం ద్వారా పరిశ్రమను పురోభివృద్ధిలో నడిపిస్తున్నారన్నారు. తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి డి.వి. రమణారెడ్డి, అధ్యక్షుడు కర్రి దాలినాయుడు, నాయకులు డి. అప్పలరాజు, గెద్దాడ అప్పలరాజు, శశిభూషణరావు, నల్ల శ్రీను, జనార్దన్, చిత్రాడ బాలకృష్ణ, సూర్యనారాయణ, సురేష్‌రెడ్డి, ఎం. శ్రీనివాస్, ఎం. రామకృష్ణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా...



చిన్నచిన్న రంధ్రాలు పెట్టి వదిలేసిన దృశ్యం

- కూటమి నేతల ఒత్తిడితో వెనక్కి తగ్గిన అధికారులు
- అధికారుల తీరుపై విమర్శలు



అజంతా పార్క్‌లో అదనపు అంతస్తు వేసిన భవనం

గోపాలపట్నం: అదొక అక్రమ నిర్మాణం... దానిపై ఫిర్యాదులు అందడంతో జోన్–8 టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం అదనపు అంతస్తును తొలగించే చర్యలు చేపట్టారు. అయితే ఈ చర్యలు తూతూ మంత్రంగా చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిన్న చిన్న రంధ్రాలు పెట్టిఫొటోల కోసమన్నట్టుగా తొలగింపులు చేపట్టారు.

ఇదీ విషయం

జీవీఎంసీ 92వ వార్డు అజంతా పార్క్‌లో సిల్ట్ జీప్లస్2 అనుమతులతో భవన నిర్మాణం చేపట్టారు. అయితే దీనిపై ఇటీవల మరో అంతస్తు అనుమతులు లేకుండా వేశారు.దీంతో ఈ భవనంపై ఫిర్యాదులు రావడంతో తొలగింపు చర్యలు చేపట్టారు. అయితే భవనం వద్దకు అధికారులు రాగానే కూటమి నేతలు కొందరు ఫోన్లు చేసి అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రెండు చోట్ల చిన్న రంధ్రాలు పెట్టి వదిలేశారు. అదనపు అంతస్తు వేసేందుకు కూటమి నేతలు భారీ స్థాయిలో ముడుపులు అందుకున్నారని అందుకే అదనపు అంతస్తు తొలగించకుండా అడ్డుకున్నారని ప్రచారం సాగుతోంది.

ప్రజా సమస్యలపై సర్వే



సర్వేలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మల్కాపురం: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు సీపీఎం నాయకులు సర్వే చేపట్టారు.59వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో బుధవారం ఆ పార్టీ మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి తదితరులు ఇంటింటికి వెళ్లి కూటమి అధికారంలోకి వచ్చిన ఎదుర్కొంటున్న ఇబ్బందులు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలా మంది తమకు సొంత ఇల్లు లేదని, టిడ్కో ఇల్లు కేటాయిస్తామన్నాని హామీ ఇచ్చినా కూటమి నాయకులు ఆచరణలో చూపలేదని వివరించారు. వెలగని వీధిలైట్లు,కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం,సీసీ రోడ్డు,సీసీ కాలువలు లేక ఇబ్బంది పడుతున్నట్టు వివరించారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

62వ వార్డులో

సింథియా: సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం, అల్లూరిసీతారామరాజు, దుర్గానగర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలువులకు 78 మంది ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధులు

పెదగంట్యాడ: యువతకు ఉపాధి కల్పించేందుకు నాలుగు ఎంఎన్‌సీ కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు సుమారు 141 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వీల్స్ ఇండియా లిమిటెడ్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కంపెనీలకు అవసరమైన 78 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10వేల744 నుంచి రూ.27వేల వరకూ జీతం ఇవ్వనున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు పి. శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఉక్కు ఆస్పత్రి జనరల్ మేనేజర్ సారంగికు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. నాయకులు బుధవారం ఉక్కు జనరల్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ సారంగిని కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మందులు, వైద్యుల కొరత తీవ్రంగా ఉందన్నారు. అదే విధంగా నర్సులు, అటెండెంట్లు లేకపోవడం వల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్లు తక్కువగా ఉండటం, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ వైద్యులు లేకపోవడం వల్ల ఉద్యోగులు బయట ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. రోగులకు సకాలంలో మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, అన్ని మందులు డిస్పెన్సరీలో అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు, రమణమూర్తి, ఎస్.ఎ. నాయుడు, ప్రభాకరెడ్డి, బి.టి. జగదీష్, కోరిబిల్లి అప్పారావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ చెర నుంచి స్టీల్‌ప్లాంట్ భూమికి విముక్తి



స్టీల్‌ప్లాంట్ భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీ బోర్డు

- కబ్జాదారుల చేతుల్లో సుమారు 90 సెంట్ల భూమి
- అందులో క్రికెట్ అకాడమీ ఏర్పాటు
- కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు
- స్పందించిన స్టీల్‌ప్లాంట్ అధికారులు
- భూమిని స్వాధీనం చేసుకొని మొక్కలు నాటిన వైనం

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ అధికారులు స్పందించారు.. కబ్జాదారుల చేతుల్లో చిక్కుకున్న సుమారు 90 సెంట్లు భూమికి విముక్తి కల్పించారు. అందులో అక్రమంగా నిర్మించిన క్రికెట్ అకాడమీ కట్టడాలను తొలగించారు. ఆపై అందులో మొక్కలు నాటారు. ఈ భూ ఆక్రమణకు సంబంధించి వివరాల ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట సమీపంలోని నడుపూరు గ్రామం సర్వే నెంబర్ 232లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూమి ఉంది. ఆ స్థలాన్ని ఓ వ్యక్తి ఇటీవల ఆక్రమించాడు. ఆ భూమిలో ఉన్న లక్షలాది రూపాయల విలువైన చెట్లను నరికించేశాడు. భూమిని చక్కగా చదును చేయించాడు. ఆ స్థలాన్ని క్రీడామైదానంగా తీర్చిదిద్దాడు. అందులో క్రికెట్ అకాడమీ నెలకొల్పాడు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న తతంగంపై స్థానికులు పెద్ద ఎత్తున స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు ఆ భూమిని పరిశీలించారు. సర్వే చేసి ఆ భూమి స్టీల్‌ప్లాంట్‌కు చెందినదిగా నిర్ధారించుకున్నారు. తర్వాత అక్కడ సర్వే రాళ్లు పాతించారు. ఆపై అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ అధికారులు బాలరాజు, వెంకటేష్, మంత్రి నర్సింహమూర్తి, భాస్కర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ ఈ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సర్వేయర్లు, పెదగంట్యాడ మండల రెవెన్యూ సర్వేయర్లు, దువ్వాడ పోలీసులు పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్’ రద్దు చేయాలి

- ఆ నిర్ణయాన్ని పార్లమెంట్‌లో ప్రకటించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో జేఏసీ నేతల డిమాండ్
- ప్రచార కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అఖిల పక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

అల్లిపురం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ రద్దు నిర్ణయాన్ని కేంద్రం పార్లమెంటులో ప్రకటించాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరింది. జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీజేఎస్ అచ్యుతరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ నేతలు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ బి.నాగభూషణం, కన్వీనర్ ఎన్.కనకారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు 11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చి, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఈ కుట్రను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరినీ యథావిధిగా విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 1న మహాధర్నా

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిల పక్ష కార్మిక ప్రజాసంఘాల జేఏసీ ఏర్పడి 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ 1న జీవీఎంసీ వద్ద నిర్వహిస్తున్న శిబిరంలో వందలాది మందితో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్‌వీ కుమార్, ప్రభుత్వ రంగ పరిశ్రమల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, బూసి వెంకటరావు, సురేష్, రమణ, లక్ష్మి, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి పాలిటెక్నిక్ కీలకం

మురళీనగర్: పారిశ్రామిక ప్రగతికి పాలిటెక్నిక్ కీలకంగా మారిందని గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ప్రొఫెసర్ పి.సోమరాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కాలేజీ వార్షికోత్సవం, జాబ్ ఎచీవర్స్ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక ప్రగతికి పాలిటెక్నిక్ విద్యతో తక్షణ ఉపాధి పొందవచ్చన్నారు. ప్రయోగాత్మక అనుభవం పాలిటెక్నిక్ విద్యార్థులకు చాలా అవసరమన్నారు. గౌరవ అతిథి వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వస్తున్నాయని, పాలిటెక్నిక్ విద్యకు డిమాండ్ పెరుగుతూనే ఉంటుందన్నారు.

నూరు శాతం ఉద్యోగాలు

సభాధ్యక్షుడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ ఈ ఏడాది పాలిటెక్నిక్ విద్యార్థులు రికార్డ్ స్థాయిలో నూరు శాతం ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా రూ.9.06 లక్షల అత్యధిక వార్షిక వేతనంతో తమ కాలేజీ ఎలక్ట్రికల్ డిప్లొమా విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి, రీజనల్ స్థాయి క్రీడా పోటీలు, ప్రాంతీయ స్థాయి టెక్ ఫెస్ట్ విజయవంతంగా నిర్వహించామన్నారు. ముఖ్య అతిథులు, ప్రిన్సిపాల్ వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు.